RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శుక్రవారం | పేజీలు : 6
సంపుటి : 3, సంచిక : 308 | నవంబర్ 14, 2025 | వెల : రూ.3-00



## ఎయిర్పోర్ట్ భూసేకరణలో జాప్యం జరగకూడదు

4లో..

# ప్రతి చిన్నారికి హక్కు



- ☐ బాలలదే భవిష్యత్
- ☐ నేటి బాలలే రేపటి పౌరులు
- ☐ వారి చేతుల్లోనే టోటల్ ఫ్యూచర్
- ☐ భారత తొలి పీఎం నెహ్రూ జయంతి
- ☐ చిల్డ్రన్స్ రైట్స్, సంరక్షణ, విద్యపై అవగాహన
- ☐ దేశవ్యాప్తంగా ఘనంగా 'బాల్ దివస్' సెలబ్రేషన్స్

**వేద న్యూస్, డెస్క్:**

స్వతంత్ర భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహార్ లాల్ నెహ్రూ జయంతి పురస్కరించుకుని జరుపుకునే బాలల దినోత్స వాన్ని 'బాల దివస్' అని కూడా పిలుస్తారు. ప్రతి సంవత్సరం నవంబర్ 14ను బాలలదినోత్సవంగా జరుపుకోవడం భారతదేశానికి ఒక సంప్రదాయం మాత్రమే కాదు... పిల్లలపట్ల సమాజం కలిగి ఉండాల్సిన నైతిక బాధ్యతను గుర్తు చేసే రోజు కూడా. జవహార్‌లాల్ నెహ్రూ జన్మదినం సందర్భంగా జరిగే ఈ వేడుక చిన్నారులపై ప్రేమను మాత్రమే కాదు, వారి హక్కుల పరిర క్షణను, వారి భవిష్యత్తును కాపాడాల్సిన అవస రాన్ని దేశానికి గుర్తుచేస్తుంది. పిల్లలు సుర క్షితంగా పెరిగే ప్రతి అడుగు దేశ అభివృద్ధికి నేరుగా దోహదపడుతుంది. నిజానికి 'యూని వర్సల్ చిల్డ్రన్స్ డే'గా నవంబర్ 20న భారతదేశంలో బాలల దినోత్సవాన్ని జరుపుకునే వారు. కానీ, 1964లో నెహ్రూ మరణానంతరం అది నవంబర్ 14కి మారింది.

**- బాలల విద్యపై అవగాహన**

చిల్డ్రన్స్ రైట్స్, సంరక్షణ, విద్యపై అవగాహన కల్పించేందుకు దేశవ్యాప్తంగా నవంబర్ 14న బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటారు. అయితే, ఇప్పటికీ భారతదేశంలో చిన్నారులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. బాలకార్మికులుగా, బాల్యవివాహాలు, విద్య లభ్యతలో అసమానతలు, శారీరక మానసిక వేధింపులు వంటి సమస్యలు సమాజాన్ని ఆలోచింపజేస్తున్నాయి. బాలలదినోత్సవం సందర్భంగా ఈ సమస్యలపై ప్రజల్లో అవగాహన పెంచడం అత్యంత అవసరం. పిల్లల హక్కులు ప్రసంగాలకే పరిమితం కాకుండా, వాటిని అమలు చేసే దిశలో ప్రభుత్వం, సంస్థలు, కుటుంబాలు మూడు విభాగాలూ కలిసి ముందుకు సాగాలి.

**- గొప్ప ఆయుధం విద్య**

విద్య చిన్నారి జీవితాన్ని మార్చే గొప్ప ఆయుధం. నాణ్యమైన విద్య చిన్నారులను మాత్రమే కాకుండా వారి కుటుంబాలను కూడా అభివృద్ధి దిశగా తీసుకెళ్తుంది. ప్రభుత్వం చేపడుతున్న విద్యా సంస్కరణలు, డిజిటల్ లెర్నింగ్ అవకాశాలు, స్కూల్ మౌలిక సదుపాయాల బలోపేతం వంటి చర్యలు ఈ దిశలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. విద్యను హక్కుగా ప్రకటించడం కంటే, ప్రతి చిన్నారి దాన్ని నిజంగా పొందేలా చూడటం మరింత ముఖ్యమైన బాధ్యత. పిల్లల మానసిక ఆరోగ్య అంశం కూడా ఇటీవలి కాలంలో ప్రధాన చర్చగా మారుతోంది. ఒత్తిడి, పోటీ, సామాజిక ఒత్తిళ్లు చిన్నారులపై ప్రభావం చూపుతుండటంతో, పాఠశాలలు కౌన్సెలింగ్ సదుపాయాలు, స్నేహపూర్వక నేర్పు విధానాలు అమలు చేయాల్సిన అవసరం ఉంది. కుటుంబాలు కూడా పిల్లల భావోద్వేగాలను అర్థం చేసుకుని, వారికి వినడానికి సమయం కేటాయించాలి. "పిల్లలు ప్రేమతో పెరుగుతారు" అనే భావనను సమాజం గుర్తుంచుకోవాలి. పిల్లలపై జరుగుతున్న నేరాలను అరికట్టడం కూడా సమాజం మొత్తం బాధ్యత. బాలలపై దాడులు, దుర్వినియోగం వంటి ఘటనలకు చట్టపరమైన శిక్షలు మరింత కఠినంగా మారుతున్నా, అవగాహన లేకపోవడం, నిర్లక్ష్యం వంటి కారణాలు ఇంకా సమస్యగా ఉన్నాయి. ప్రతి ప్రాంతంలో అవగాహన కార్యక్రమాలు, పోలీసు సమాజ భాగస్వామ్యం, సురక్షిత పాఠశాల పరిసరాలు అవసరం. చిన్నారుల భద్రతను నిర్ధారించడం దేశ భవిష్యత్తును రక్షించే చర్యగా భావించాలి.

బాలలదినోత్సవం సందర్భంగా స్కూల్లు, సంస్థలు, సమాజ సేవా సంస్థలు పిల్లల కోసం ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అవగాహన సమావేశాలు నిర్వహిస్తాయి. ఇవి పిల్లల ప్రతిభను వెలికితీత కోసం మాత్రమే కాదు, వారిలో కొత్త నమ్మకం, ఉత్సాహం, సామాజిక అవగాహన కలిగిస్తాయి. కుటుంబాలు కూడా పిల్లల కోసం చిన్న వేడుకలు ఏర్పాటు చేయడం, వారి కలలను ప్రోత్సహించడం, వారి భావాలను వినడం వంటి చర్యలు చేయవచ్చు. ఈ ప్రత్యేక దినం అవకాశమే కాదు ఒక సందేశం కూడా. "ప్రతి చిన్నారికి ప్రతి హక్కు" అనే నినాదం కేవలం మాట కాదుబీ అది ఒక దేశం భవిష్యత్తు ఎలా ఉండాలో చూపించే దారి. ఆరోగ్యం, విద్య, రక్షణ, సమానత్వం ఇవన్నీ పిల్లలకు హక్కులుగానే కాక అభివృద్ధి మార్గాల్లోని మెట్లుగా కూడా గుర్తించాలి. పిల్లల భవిష్యత్తు బలంగా ఉంటేనే దేశ భవిష్యత్తు ప్రకాశిస్తుంది. ఈ బాలలదినోత్సవం మనందరికీ ఒక స్పష్టమైన గుర్తు.. చిన్నారుల పట్ల బాధ్యతను ప్రతి కుటుంబం, ప్రతి ఉపాధ్యాయుడు, ప్రతి పౌరుడు ఆచరణలో చూపాలి. పిల్లలు నేడు నవ్వితేనే రేపటి భారతం వెలుగుతుంది. ఈ విషయాన్ని గుర్తెరిగి.. నేటి బాలలే రేపటి బాధ్యతాయుతమైన పౌరులని తెలుసుకుని వారి సం'రక్షణ'కు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలి.



## వరంగల్ బస్టాండులో పడవ ప్రయాణం..!

- ఓరుగల్లు అభివృద్ధికై బీజేపీ పోరాటం..!
- వరంగల్ బస్టాండ్ నిర్మాణంలో ప్రభుత్వం విఫలం
- బీజేపీ వినూత్న నిరసన
- బస్టాండ్ ప్రాంగణంలో పడవలు నడిపిన బీజేపీ నాయకులు



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**

వరంగల్ బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు మాయల మరాఠీ పార్టీలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే వరంగల్ బస్టాండ్ పేరుతో నయవంచన చేస్తే.. ప్రస్తుత ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ అసమర్థతతో బస్టాండ్ నిర్మాణానికి నోచుకోవడం లేదని మండి పడ్డారు. చారిత్రక నగరమైన వరంగల్‌కు బస్టాండ్ నిర్మాణానికి ఒక్క అడుగు ముందుకు పడకపోవడంతో వరంగల్ ఆత్మగౌరవ పోరాటం మహా ధర్నా- 2 పేరుతో గురువారం బీజేపీ వరంగల్ బస్టాండ్ ఏర్పాటు ప్రాంతంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులకు ఉచిత పడవ ప్రయాణం వినూత్న నిరసన చేపట్టింది. రాష్ట్ర రెండో రాజధానిగా వరంగల్‌ను తీర్చిదిద్దుతామంటూ ప్రగల్భాలు పలుకుతున్న సర్కారు.. కనీసం వరంగల్ బస్టాండ్ నిర్మాణ పనులను చేపట్టడం లేదంటూ మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే కొండా సురేఖ మంత్రిగా ఉన్నా.. పట్టించుకోకపోవడం ఆమె అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. ఎన్నికల ముందు అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ కోట్ల రూపాయలతో కొత్త బస్టాండ్ నిర్మిస్తామంటూ ఇదిగో.. నమూనా బస్టాండ్ అంటూ మాయమాటలు చెప్పి ఉన్నదానిని కూల్చాడని మండి పడ్డారు. ఆ తర్వాత కనీసం అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదన్నారు. కాకతీయుల ఆర్థిక రాజధానిగా, పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న వరంగల్‌కు కనీసం బస్టాండ్ లేకపోవడం ఏంటని పర్యాటకులు ముక్కుమీద వేలు వేసుకుంటున్నారని వాపోయారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హృదయ్, అమృత్, స్మార్ట్ సిటీ వంటి ఎన్నో పథకాలకు భారీగా నిధులు కేటాయించి వరంగల్‌ను ప్రగతిదారిలో నడిపిస్తుంటే బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు మాత్రం ఓరుగల్లు చరిత్రను భ్రష్టు పట్టిస్తున్నాయని తీవ్రంగా విమర్శించారు. వరంగల్ బస్టాండ్ నిర్మాణ పనులు ఒక్కఅడుగు ముందుకు పడకపోయినా ఇక్కడి బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఎందుకు ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ రెండు పార్టీలకు ఓట్లు తప్ప వరంగల్ అభివృద్ధిపై కనీస పట్టింపులేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల భూముల్ని కబ్జా చేయడంలో.. సెటిల్‌మెంట్ పనుల్లో ఆ పార్టీల నేతలు బీజీబిజీగా ఉన్నారని, ఇక వారికి ప్రజా సమస్యలు ఏం పడతాయంటూ ఆరోపించారు. ఓరుగల్లు సమగ్రాభివృద్ధి, అస్థిత్వం, ఆత్మగౌరవం కోసం బీజేపీ పాటు పడుతుందన్నారు. ఓరుగల్లు అభివృద్ధి కోసం ఇక ఉద్యమాన్ని ఉధృతం చేసి ఉమ్మడి జిల్లా మంత్రుల మరియు శాసనసభ్యుల ఇండ్లను ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్య వర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, కుసుమ సతీష్, రత్నం సతీష్, మాజీ శాసనసభ్యులు వన్నాల శ్రీరా ములు, రాష్ట్ర నాయకులు కంభంపాటి పుల్లారావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, మల్లాడి తిరుపతిరెడ్డి, గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, జలగం రంజిత్ రావు, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ గజ్జేల శ్రీరాములు, జిల్లా, మండల పదాధికారులు, వివిధ మోర్చా జిల్లా అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు మహిళా మోర్చా పాల్గొన్నారు.

### తెలంగాణ వక్ఫ్ బోర్డు పనితీరుపై

## మంత్రి అజరుద్దీన్ సమీక్ష

- వక్ఫ్ ఆస్తులు, పరిపాలనా సంస్కరణలు ప్రధాన ప్రాధాన్యం
- బోర్డు పనితీరును బలోపేతం చేసేందుకు కీలక సూచనలు

**వేద న్యూస్, హైదరాబాద్ :**



తెలంగాణ వక్ఫ్ బోర్డు పనితీరుపై సచివాలయంలో మంత్రి మహ్మద్ అజరుద్దీన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. వక్ఫ్ ఆస్తుల సంరక్షణ, పరిపాలనా సామర్థ్యాన్ని పెంపొందించడం, బోర్డు కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడం వంటి అంశాలపై ఈ సమావేశంలో విస్తృత చర్చ జరిగింది. ములాఖాతలో మైనారిటీల సంక్షేమ శాఖ సెక్రటరీ బి. షఫీయుల్లా వక్ఫ్ బోర్డు సీఈఓ మహ్మద్ అసదుల్లా, తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వక్ఫ్ ఆస్తులపై కొనసాగుతున్న వివాదాలు,

మిగతా 3వ పేజీలో..

## విద్యార్థులారా మేల్కొనండి..!

- విద్యా వ్యవస్థ చచ్చిపోయింది - ఆర్జీవీ సంచలన ట్వీట్
- ఏఐ విప్లవం ముందు సంప్రదాయ విద్య పని చేయదన్న విమర్శ
- జ్ఞాపకశక్తి ఆధారిత పరీక్షలు అవకాశాలు ఇవ్వవని స్పష్టం

**వేద న్యూస్, హైదరాబాద్ :**



సంచలన వ్యాఖ్యలకు పేరుమోసిన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మళ్లీ మరో ట్వీట్‌తో సోషల్ మీడియాలో చర్చకు తెరలేపారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) విప్లవం నేపథ్యంలో ప్రస్తుత విద్యా వ్యవస్థ పూర్తిగా "చనిపోయింది" అని ఆర్జీవీ చేసిన వ్యాఖ్యలు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల్లో పెద్ద చర్చ రేకెత్తిస్తున్నాయి. "విద్యార్థులారా మేల్కొనండి ఏఐ ముందు పాత విద్య నిలబడదు" అని ఆయన ట్వీట్‌లో స్పష్టం చేశారు. ప్రస్తుత విద్యా విధానం కాలం చెల్లిందని, అది జ్ఞాపకశక్తిపై ఆధారపడిన పాత పద్ధతి మాత్రమేనని ఆర్జీవీ పేర్కొన్నారు. ఒక క్లిక్‌తో లక్షల కేసులు విశ్లేషిం చగలిగే ఏఐ ఉన్నప్పుడు,

మిగతా 3వ పేజీలో..

# జీవనశైలి మార్పుతో డయాబెటిస్‌కు చెక్!

## - నేడు ప్రపంచ మధుమేహ దినోత్సవం

**వేద న్యూస్, జమ్మికుంట:**



నవంబర్ 14ను ప్రపంచ మధుమేహ దినోత్సవం (వరల్డ్ డయాబెటిస్ డే)గా జరుపుకుంటాం. డయాబెటిస్‌పై అవగాహన పెంపొందించడం, నిరోధక చర్యలు తీసుకోవడం, నియంత్రణలో ఉంచుకోవడం కోసం ప్రపంచవ్యాప్తంగా ఈ దేను జరుపు కుంటారు. ఒకే చోట కూర్చుని ఉండటం, శారీరక శ్రమను మరిచిపోవడం కాకుండా జీవనశైలి మార్పుయే డయాబెటిస్‌కు మందు అని నిపుణులు పేర్కొంటున్నారు. మధు మేహం వ్యాప్తి విషయంలో భారత్, ఉభయ తెలుగు రాష్ట్రాలు ఉండటం ఆందోళనకర విషయం. కాగా, మధుమేహం నివారణకు, నియంత్రణకు ప్రముఖ వైద్యుడు కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఊడుగుల సురేశ్ కీలక సూచనలు చేశారు.

**ఆహార నియమాలు**

చక్కెర, స్వీట్లు, సాఫ్ట్ డ్రింక్స్ తగ్గించాలని, ఎక్కువగా కూరగాయలు, ఆకుకూరలు, సంపూర్ణ ధాన్యాలు (తీసుకోవాలని డాక్టర్ సురేశ్ తెలిపారు.తక్కువగా అయినా కానీ తరచుగా తినడం మంచిదని, రాత్రి భోజనం తేలికగా చేయాలని వెల్లడించారు. రోజుకు కనీసం 30 నిమిషాలు నడవడం లేదా తేలికపాటి వ్యాయామం చేయాలని, బరువు నియంత్రణలో ఉంచుకోవాలని చెప్పారు. పొగ తాగడం, మద్యం వాడకం పూర్తిగా మానేయాలని, ఒత్తిడి (స్ట్రెస్) తగ్గించుకోవాలని, యోగా, ధ్యానం, సరదా కార్యకలాపాలు చేయాలని తెలిపారు. నిద్ర సరిపడా (6-8గంటలు) పడుకోవాలని, రెగ్యులర్ హెల్త్ చెకప్ చేయించుకోవాలని వెల్లడించారు. రక్తంలో చక్కెర స్థాయిలను (ఎఫ్‌బీఎస్,పీపీబీఎస్,హెచ్ అబీ ఏ1సీ)లను నియమి తంగా పరీక్షించుకోవాలని, కంటి, మూత్రపిండాలు, పాదాల ఆరోగ్యం కూడా పర్యవేక్షించాల న్నారు. మధుమేహం ఉన్నవారు వైద్యుని సూచనల ప్రకారం మందులు నియమితంగా తీసుకోవాలని తెలిపారు.

# స్టూడెంట్స్‌కు స్కూల్ బ్యాగుల పంపిణీ

**వేద న్యూస్, జమ్మికుంట:**



చదువు ప్రతి ఒక్కరి హక్కు అని ప్రాథమిక దశ నుండే మంచి క్రమశిక్షణతో విద్యార్థులు చదువుకొని భావి భారత పౌరులుగా ఎదగాలని పీఎస్‌కే ఫౌండేషన్ వ్యవస్థాపకులు పొనగంటి సాత్విక్ పటేల్ పిలుపునిచ్చారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెం గ్రామం నందు గల మండల ప్రాథమిక పాఠశాలలో పొనగంటి పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగుల పంపిణీ కార్యక్రమము నిర్వహించారు. ఈకార్యక్రమంలో జమ్మికుంట టౌన్ ఎస్ఐ సతీష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమములో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో ఎస్సై, కానిస్టేబుల్..!

**వేద న్యూస్, సిద్దిపేట :**




సిద్దిపేట జిల్లా ములుగు పోలీస్ స్టేషన్ లో ఏసీబి అధికారులు దాడులు నిర్వహించారు. పక్కా సమాచారం మేరకు ఓ కేసు పరిష్కారం చేసేందుకు ఓ వ్యక్తి నుండి యాభై వేయిల రూపాయలు ఎస్ఐ విజయ్ కుమార్, కానిస్టేబుల్ రాజు లంచం తీసుకుంటుండగా ఏసీబి అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఏసీబి అధికారి తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 5వ తేదీన ఎస్సై లంచం అడుగుతున్నారని ఏసీబీకి కంప్లైంట్ చేశారని ములుగు పరిధిలోని రాజీవ్ గృహకల్పంలో ఓ వ్యక్తికి డబుల్ బెడ్ రూమ్ కేటాయించారు. కానీ ఆ ఇంటిలో అనధికారికంగా కబ్జాలో ఉంటూ వేరే వ్యక్తి ఆ ఇంట్లో నివాసం చేస్తున్నారు. దీనిపై పోలీస్ స్టేషన్లో సదర్ వ్యక్తి కంప్లైంట్ ఇవ్వగా అతని ఇల్లు ఖాలి చేపించాలంటే లక్ష రూపాయలు ఇస్తేనే నీ సమస్యను పరిష్కరిస్తామని పోలీసు అధికారులు తెలిపారని దీనికి కారణం ముందస్తుగా 50 వేల రూపాయలు ఇస్తున్నానని తెలిపారు. కంప్లైంట్ దారుడు పోలీస్ స్టేషన్ కు వెళ్లి 50 వేల రూపాయలు ఎస్ఐ విజయ్ కుమార్ మరియు కానిస్టేబుల్ కి ఇస్తుండగా తమకు ఇచ్చిన సమాచారం మేరకు హ్యాండెడ్ గా పట్టుకున్నామని తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

# విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు

**వేద న్యూస్,బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం అనంతపల్లి ప్రాథమిక పాఠశాలలో రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం(ఆర్ బి ఎస్ కే) ద్వారా వైద్యులు విద్యార్థులకు, అనీమియా, రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు పరిశుభ్రంగా ఉండాలని పౌష్టికాహారం తినాలని చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డా. లహరిక,డా. పావని, ఘోస్ ఫార్మసిస్ట్, సౌజన్య ఏఎన్ఎం, ప్రధానోపాధ్యాయులు జి. గురుదేవ్,ఉపాధ్యాయులు రాజశేఖర్,అలాగే అంగన్వాడీ టీచర్ భారతి, పాల్గొన్నారు.

# అడవి జాతీయ ఆస్తి

## - ఫారెస్ట్ ప్రొటెక్షన్ అందరి బాధ్యత
## - సమాజం ఫారెస్ట్ వారియర్స్‌కు అండగా నిలవాలి



అడవి అంటే మానవజాతి ఊపిరి. చెట్లు శ్వాసిస్తేనే మనం శ్వాసించగలం. మేఘాలు వర్షమై కురవడానికి, నదులు ప్రవ హించ డానికి, నేల సారవంతంగా ఉండడానికి అడవే మూలం. పక్షులు, జంతువులు, వృక్షాలు, సూక్ష్మజీవులు అన్నీ ఈ ప్రకృతిచక్రంలో భాగం. ఈ సమతుల్యత చెదిరితే మనిషి జీవనం కూడా ప్రమాదంలో పడు తుంది.


అయినా మనం అదే ప్రకృతిని హానికర చర్యలతో ధ్వంసం చేస్తున్నాం. అక్రమంగా భూములు ఆక్రమించడం, చెట్లను నరికి వేయడం, పోడు పేరుతో అడవులను నాశనం చేయడం.. ఇవన్నీ పర్యావరణానికి పగతీర్చుకునే పనులు. కొంతమంది వ్యక్తుల లాభం కోసం జరిగే ఈ అక్రమ పోడ్లు అడవుల గుండెల్లో గాయాలు సృష్టిస్తున్నాయి. వందలాది సంవత్సరాలుగా పెరిగిన అడవులను ఒక్క రోజులో ధ్వంసం చేయడం అంటే భవిష్యత్ తరాల ఊపిరి తీయడమే.

**అడవి దేశ జీవనరేఖ**

భారతదే అడవులు ఎవరికీ వ్యక్తిగత ఆస్తి కావు. అవి జాతీయ ఆస్తి.. ఈ దేశపు జీవనరేఖ. ప్రతి భారతీయుడికి అడవి పరిరక్షణ పట్ల బాధ్యత, హక్కు ఉంది. అయితే, కొంతకాలంగా ఎవరికో వాగ్దానం చేసినట్టు అడవులను కొందరు "నా భూమి, నా హక్కు" అంటూ ఆక్రమిస్తుంటే ప్రభుత్వం చూస్తూ ఉండకూడదు. అటవీ చట్టాలను కఠినంగా అమలు చేసి, పోడును ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించకూడదు. అడవిపైన ఆధారపడే స్థానిక ప్రజలకు పునరావాసం, జీవనోపాధి కల్పించటం ప్రభుత్వం పరిష్కార ప్రధాన దారి కావాలి, అలా చేస్తే అడవి నాశనం కాదు. అటవీ సంరక్షణ పోరాటంలో "ఫారెస్ట్ వారియర్స్" అంటే అటవీ సిబ్బంది, అటవీ అధికారులు.. అద్భుతమైన ధైర్యంతో ముందుకు సాగుతున్నారు. ఎండలో, వానలో, అడవిలో దాడులు, బెదిరింపులు, రాజకీయ ఒత్తిడుల మధ్య అడవిని కాపాడుతూ త్యాగం చేస్తున్నారు. అనేక సందర్భాల్లో తమ ప్రాణాలను కోల్పోయిన అటవీ సిబ్బంది మనందరికీ స్ఫూర్తి. వారి సేవకు మన సమాజం జోహార్లు చెప్పాలి. అయితే, అటవీ సంరక్షణ విషయమై కేవలం అటవీ శాఖపై బాధ్యత వేయడం సరిపోదు. పౌరుడిగా ప్రతి ఒక్కరు అడవిని కాపాడే దిశగా ఆలోచించాలి. శబ్దం లేని పోరాటం కూడా సమాజం నుంచి మొదలవుతుంది. అక్రమ పోడు ఎక్కడ జరిగినా మనం మౌనం పాటించకూడదు. వృక్షారోపణలో పాల్గొనాలి, అడవి చట్టాల ప్రాముఖ్యతను తెలియజేయాలి, స్థానికులతో కలిసి ప్రకృతిని రక్షించే కార్యక్రమాలను చేపట్టాలి.

**భవిష్యత్ పెట్టుబడి అటవీ సంరక్షణ**

అడవులు లేకుండా మానవజీవనం ఉండదు. నదులు ఎండిపోతే నీరు ఎక్కడి నుండి వస్తుంది? వర్షాలు లేకుంటే పంటల కోసం మేఘాలపై ఎవరుపోయి విత్తనాలు వేస్తారు? ఈ ప్రశ్నలకు ఒక్క సమాధానం అడవి. అందుకే అడవిని కాపాడటం అనేది పర్యావరణానికి మాత్రమే కాదు, మన భవిష్యత్తుకు పెట్టుబడి. ఇక ఆలస్యం చేయకూడదు. అక్రమ పో డును అడ్డుకోవాలి. ఫారెస్ట్ వారి యర్స్‌కు గౌరవం ఇవ్వాలి. సమాజం మొత్తం ఒక గళంగా, ఒక బాటగా నిలబడాలి. అడవి ని కాపాడటం అంటే జీవాన్ని కాపాడటం. అందరం చేతులు కలిపి ప్రకృతికి అండగా నిలుద్దాం-ఎందుకంటే "ప్రకృతి ఉన్న చోటే భవిష్యత్ ఉం టుంది."



**- రవిబాబు, పిట్టల, పర్యావరణవేత్త, జాయింట్ సెక్రటరీ, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ.**

# రైతు అభ్యున్నతే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

## - ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వేద న్యూస్, హనుమకొండ బ్యూరో:**

రైతు పండించిన ధాన్యం చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ,ప్రజా ప్రభుత్వం రైతు అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు సాగుతోందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం కాజీపేట సోమిడిలో నూతనంగా వరి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. గతంలో కొనుగోలు కేంద్రం అందుబాటులో లేక రైతు దూర ప్రాంతాలకు ధాన్యాన్ని తరలించి అమ్మేవారని తమ ఆవేదన అర్థం చేసుకుని రైతుల పక్షపాతిగా నిలిచిన ఎమ్మెల్యేకి స్థానిక రైతులు సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు బలంగా ఉంటే గ్రామం బలంగా ఉంటుంది, గ్రామం బలంగా ఉంటే తెలంగాణ బలంగా ఉంటుంది. గతంలో పాలించిన నేతలు కూడా సోమిడి రైతులకు అండగా నిలిచిన దాఖలాలు లేవు. కానీ, మా ప్రభుత్వం ఆ లోటును గుర్తించింది. స్థానికంగా ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే కాజీపేట, సోమిడి రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని భావించి జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష జరిపి, సోమిడిలో కచ్చితంగా ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని నేను విజ్ఞప్తి చేశాను. ఇంతవరకు సోమిడి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం లేకపోవడం వల్ల రైతులు సమీప ప్రాంతాలకు వెళ్లి తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇకపై రైతులు మీ గ్రామంలోనే ధాన్యం విక్రయించగలిగేలా ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. రైతు మన రాష్ట్ర అభివృద్ధికి మూలస్తంభం. ఆయన చెమట చిందిస్తేనే మన కుటుంబాలు అన్నం తింటాయి. ప్రతి రైతు ధాన్యానికి సరైన ధర లభించాలి, ఎవరూ నష్టపోకూడదు ఇదే మా ప్రజా ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ కేంద్రం ద్వారా రైతులు మధ్యవర్తుల జోలికి వెళ్లకుండా నేరుగా ప్రభుత్వానికి అమ్మే అవకాశం కలుగుతుంది. ధరలో పారదర్శకత ఉంటుంది, డబ్బులు సమయానికి రైతుల ఖాతాల్లో జమ అవుతాయి. ఇది రైతు గౌరవాన్ని కాపాడే దిశలో పెద్ద అడుగు అని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు క్షేమం రుణమాఫీ పథకం ద్వారా రైతులపై ఉన్న ఆర్థిక భారాన్ని తగ్గిస్తున్నాం. రైతు బంధు పథకాన్ని పారదర్శకంగా కొనసాగిస్తూ, ప్రతి ఎకరాకు నేరుగా రైతుల ఖాతాల్లో సహాయం జమ అవుతుంది. రైతు బీమా ద్వారా పంట నష్టం కలిగినప్పుడు రైతు కుటుంబాలకు తక్షణ సాయం అందించబడుతుంది. పంట ఉత్పత్తి మెరుగుపడటానికి ఉచిత విద్యుత్, ఎరువుల సరఫరా, రైతు సమన్వయ సమితులు వంటి చర్యలతో గ్రామస్థాయి నుండి రైతు దాకా పూర్తి మద్దతు అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్,సయ్యద్ విజయశ్రీ రాజాలి ,ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# 4వ రోజుకి చేరిన బీసీల పోరాట ధర్మ దీక్ష

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**



కాకతీయ యూనివర్సిటీ మహాత్మ జ్యోతిరావు పూలే ప్రాంగణంలో బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ ఆరేగంటి నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాలుగో రోజు ధర్మ దీక్షకి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ చీఫ్ వినయ్ భాస్కర్ మాట్లాడుతూ బీసీలకు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాలలో 42 శాతం రిజర్వేషన్ అమలయ్యేంత వరకు బీసీలు నిరంతరం ఉద్యమాలు చేయాల్సినటువంటి అవసరం ఉందన్నారు. బీసీలకు స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు గడిచినప్పటికీ బీసీలకు రిజర్వేషన్లు అమలు కాకపోవడం వల్ల తీవ్రమైన నష్టం కలిగిందని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా కేంద్రంలోని అధికార పార్టీపై ఒత్తిడిని పెంచి అఖిలపక్షం ఏర్పాటు చేసి ఉద్యమాన్నిచేస్తే తప్ప బీసీల కల సాకారం కాదని బీసీ సంఘాల నాయకులని, బిసి రాజకీయ నాయకులని అందరిని కూడా అఖిల పక్షంలో భాగస్వామ్యం చేసి రాజకీయాలకతీతంగా, పార్టీలకతీతంగా పోరాటం చేసి కేంద్ర ప్రభుత్వం పైన పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుడితేనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాకారం అవుతుందని ఆదిశగా ముందుకు సాగాలని కోరుకునే వ్యక్తుల్లో నేను మొదటివాడని అన్నారు. బీసీలందరూ ఒక్క తాటిపై ఉండి బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి బీసీ రిజర్వేషన్లు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో అమలయ్యే విధంగా పోరాటాలు కొనసాగించాలని తెలిపారు. అనంతరం దీక్షలో కూర్చున్నటువంటి బీసీ విద్యార్థి జేఏసీ నాయకులకు నిమ్మరసం ఇచ్చి నాలుగో రోజు రిలే నిరాహార దీక్షను విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి జేఏసీ నాయకులు నాగరాజ్ పటేల్, తిరుపతి ,అజయ్ సింగ్, సుమన్ రాజ్, అన్వేష్, రవితేజ, రాజశేఖర్, బోస్కా నాగరాజు, సాయి కృష్ణ, రాజేష్ బి ఆర్ఎస్వి నాయకులు శరత్ గౌడ్, రాజేష్, ప్రశాంత్, వీరస్వామి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# విలువైన చెట్ల నరికివేత, కలప అక్రమ తరలింపు..!

## – బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మేకల అక్షయ్ కుమార్ డిమాండ్

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

వరంగల్ నగరంలోని రంగంపేట ప్రాంతంలో గల ప్రభుత్వ మహిళా వృత్తి విద్యా కళాశాలను విద్యారణ్య ప్రభుత్వ మ్యూజిక్ మరియు డ్యాన్స్ అకాడమీ వారు తమ కళాశాలను నిర్వహించుకుంటామని తెలిపి, కళాశాలలో అభివృద్ధి పనుల నెపంతో సంబంధిత అధికారుల నుండి ఎలాంటి అనుమతులు పొందకుండానే కళాశాలలో దశాబ్ధాల కాలంగా విరివిగా పెరిగిన విలువైన నల్ల తుమ్మ, టేకు, వేప, కానుగ, సుబాబుల్, జామ, మామిడి, ఉసిరి వంటి అనేక వృక్షాలను నరికివేసి, కలపను ప్రాంగణం నుండి అక్రమంగా బయటకి తరలించారు. ఈ విధంగా ప్రభుత్వ నియమ నిబంధనలను మరియు చట్టాలను ఉల్లంఘించి చెట్ల ధ్వంసం, కలప అక్రమ రవాణా చేసిన సంబంధిత బాధ్యులందరిపై శాఖాపరమైన, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ టెక్నికల్ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మేకల అక్షయ్ కుమార్ గురువారం హన్మకొండ జిల్లా అటవీ శాఖ అధి కారికి ఫిర్యాదు చేసారు. అనంతరం జిల్లా అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కి ఘటన విషయాన్ని తెలియ పరిచి బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సంధర్భంగా పాలిటెక్నిక్ విద్యార్థి జెఏసి నాయకులు దొడ్డిపల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# సైబర్ నేరాలపై అవగాహన




**వేద న్యూస్, టేక్మాల్ :**

మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌట్ జూనియర్ కాలేజ్ నందు షీ టీమ్స్, సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలనివారణ, మత్తుపదార్తాల వినియోగం నష్టాలు అంటి డ్రగ్స్, చైల్డ్ మ్యారేజస్, సమాజంలో విద్యార్థుల భవిత, అమ్మానాన్నల విలువ, గురువుల విలువ, వయసులో ఉన్నప్పుడు అందానికి ఆకర్షతులు కాకు ండా లక్ష్యాన్ని ముందుంచుకోవాలని, వివిధ సామాజిక రుగ్మతలపై పోలీసు కళాభృందం వారిచే విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టేక్మాల్ ఎస్సై రాజేష్ ముఖ్య అతిధిగా విచ్చేసి మాట్లాడుతూ జిల్లా ఎస్పి డి. శ్రీనివాసరావు ఆదేశాలను సారముగా షీ టీమ్స్, డ్రగ్స్,సైబర్ నేరాలపై పటిష్టంగా పని చేస్తున్నామని తెలిపారు. ప్రతి స్కూల్ కాలేజీలలో చదువుకునే విద్యార్థులు ఇంటర్నెట్ ను సద్వినియోగం చేసుకోవాలి, సైబర్ మోసగాళ్ళ వల్ల మోసాలకు గురి కావద్దని బ్యాంక్ ఖాతా,ఎటిఎం కార్డ్ వివరాలు, ఓటీపీ వివరాలు ఇతరులకు తెలపవద్దని ఇతరులు ఆశ చూపితే వాటికి ఆకర్షితులు కావొద్దని, మెసేజ్ లలో వచ్చే బ్లూ లింక్ అనుసరించి వ్యక్తిగత వివరాలు నమోదు చేయవద్దు అని కోరినారు. సైబర్ మోసాలపై1930 టోల్ ఫ్రీ నంబర్ కు పిర్యాదు చేయాలని అన్నారు. అలాగే వేధింపులపై100 కుసమాచారం ఇవ్వాలని తెలిపినారు.విద్యార్థినీ విద్యార్థులు అందరూ క్రమశిక్షణ కలిగి, తల్లిదండ్రులను గురువులను గౌరవించి, ఉన్నత విద్యను అభ్యసించి మీ యొక్క లక్ష్యాలను చేరుకోవాలని తెలిపినారు. ఆకతాయిలు ఎవరైనా అల్లరి పెట్టినట్లయితే వేధించినట్లయితే షీ టీం కి సమాచారం ఇవ్వండి.మీయొక్క వివరాలు గోప్యంగా ఉంచబడతాయి అని తెలిపారు. ఏటీఎం పిన్ నెంబర్లు, వ్యక్తిగత ఫోటోలను డీపీ లుగా పెట్టుకోవద్దని చెప్పారు.మొబైల్ యాప్ లలో వచ్చేటువంటి అనవసరమైన బ్లూ లింకులను క్లిక్ చెయ్యొద్దు అని తెలిపారు. యువత చెడు వ్యసనాల బారిన పడొద్దు అన్నారు.యువత లోన్ యాప్ లకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం పోలీసు కళబృందం వారు చక్కటి సాంస్కృతిక, పాటలతో విద్యార్థినిలకు అర్థమైన రీతిలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాబృందం ఇంచార్జి సురేందర్ హెడ్ కానిస్టేబుల్ సభ్యులు జనార్ధన్, ఇసాక్ విద్యార్థినిలకు అవగాహన కల్పించినారు. ఇట్టి కార్యక్రమానికి కళాశాల ఏ ఎస్ టి యు, రామచంద్రనాయక్, హెడ్ కానిస్టేబుల్ సురేందర్, సిబ్బంది జనార్ధన్ ఇసాక్, ఇండ్ల పరిషత్ ఉన్నంత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వసంత, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటిపై పసుపు జెండా ఎగరాలి

## – ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

**వేద న్యూస్, పార్వతీపురం మన్యం జిల్లా :**

తెలుగుదేశం పార్టీ బలోపేతము, రాబోయే స్థానిక ఎన్నికల్లో శతశాతం విజయం సాధించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గురువారం నాడు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ మానవ వనరులు మరియు ఐటి శాఖ మాత్యులు నారా లోకేషఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీకి సంబంధించిన మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం ప్రభుత్వ విప్ కురుపాం నియోజకవర్గ శాసనసభ్యులు వారి ఆధ్వర్యంలో మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ కమిటీల ప్రమాణ స్వీకారం చేయించారు. ముందుగా గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో ఎల్విన్ పేట కూడలిలో అన్న నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఎల్విన్ పేట కూడలి నుండి బి.ఎస్.ఆర్ కళ్యాణ మండపం వరకు పార్టీ శ్రేణులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ ఎంతో నమ్మకంతో ప్రజాస్వామ్యబద్ధంగా కమిటీలను ఎన్నుకోవడం జరిగిందని అన్నారు. పార్టీ నమ్మకాన్ని ఒమ్ము చేయకండని, ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార దిశగా ప్రతి ఒక్కరూ పని చేయాలని అప్పుడే ప్రజల నుంచి ఆదరణ లభిస్తుందని పేర్కొన్నారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ పార్టీని బలోపేతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అప్పుడే విజయం సాధించే అవకాశం ఉందని చెప్పారు. ప్రతి గ్రామంలోనూ ప్రతి ఇంటిపైన పసుపు జెండా ఎగిరేలా కృషి చేయాలన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో అందరూ కూడా సమిష్టిగా కృషి చేసి గెలుపుకి తోడ్పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్, ఏఎంసి చైర్పర్సన్ కద్రక కళావతి, రాష్ట్ర ట్రైకర్ బోర్డ్ డైరెక్టర్ పువ్వల లావణ్య, రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ అక్కెన మధుసూదన్ రావు,



రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కొమరాడ మండల పార్టీ అధ్యక్షులు ఉదయ్ శేఖర్ పాత్రుడు, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంజిత్ కుమార్ నాయకో, టి.ఎ.సి సభ్యులు నందివాడ కృష్ణబాబు, రాష్ట్ర బీసీ సెల్ నాయకులు మారడాన తవిటి నాయుడు, సీనియర్ నాయకులు నంగిరెడ్డి మధుసూదనరావు, గుల్లిపల్లి సుదర్శన్ రావు, పొట్నూరు వెంకటనాయుడు, విజయంకుశం, నియోజకవర్గ మహిళా కార్యదర్శి వెంపటాపు భారతి, నియోజకవర్గ రైతు అధ్యక్షులు గురాన శ్రీరామూర్తి నాయుడు, అరకు పార్లమెంట్ రైతు అధ్యక్షులు దేవకోటి వెంకటనాయుడు, గరుగుబిల్లి ఎంపీపీ ఉరిటి రామారావు, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, రాష్ట తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు వావిలపల్లి దివాకర్, ఎపిటిసి కోట సుమన్, గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, గరుగుబిల్లి తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు అడ్డాకుల నరేష్, కె.వి.కొండయ్య, జోగి భుజంగరావు, మరడాన నారాయణ స్వామి నాయుడు, నాయకులు పాడి సుదర్శన్ రావు, సోములు మాస్టర్, బిడ్డికి తమ్మయ్య, దాసరి రామారావు, ఆరిక విప్లవ కుమార్, కిషోర్, కృష్ణమూర్తి నాయుడు, హైమావతి ఐదు మండలాలకు సంబంధించిన మండల కమిటీ సభ్యులు, క్లస్టర్ ఇంచార్జిలు, యూనిట్ ఇన్చార్జులు, బూత్ ఇన్చార్జులు, గ్రామ కమిటీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పరారిలో ఉన్న నిందితుడు అరెస్ట్

**వేద న్యూస్,శాయంపేట:**

పరారీలో ఉన్న నిందితుడిని అరెస్టు చేసినట్లు శాయంపేట సీఐ రంజిత్ రావు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం గత నెల 18వ తేదీన మందారిపేట స్టేజీ దగ్గర లారీని అడ్డుకొని లారీ డ్రైవర్, ఓనర్ పైన దాడి చేయగా లారీ డ్రైవర్ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ముష్కే రవితేజని పోలీసులు అరెస్ట్ చేసి పరకాల కోర్ట్ కు హాజరు పరచి మేజిస్ట్రేట్ రిమాండ్ కు తరలించారని శాయంపేట సీఐ రంజిత్ రావు తెలిపారు.అందులోని కొందరి నిదితులను ఇదివరకే అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు ఆయన తెలిపారు.



# సుదర్శన్ రెడ్డికి ఘన స్వాగతం పలికిన నాయకులు

**వేద న్యూస్, రుద్రూర్ :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారులుగా నియమితులై పదవి బాధ్యతలు చేపట్టి మొదటిసారిగా నిజామాబాద్ కు విచ్చేయుచున్న సుదర్శన్ రెడ్డికి ఘనంగా స్వాగతం పలకడానికి బాన్సువాడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూరు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గురువారం రుద్రూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో బయలుదేరి వెళ్లారు. తరలివెళ్లిన వారిలో కాంగ్రెస్ నాయకులు కర్క అశోక్,వడ్ల నరేష్, షేక్ నిస్సార్, షేక్ గౌస్, పట్ల సురేష్, రవి తదితరులు ఉన్నారు.



# ధాన్యం కొనుగోలులో మోసం జరగకుండా చర్యలు తీసుకోవాలి

## – సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేష్

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**




రాజన్న సిరిసిల్ల బివై నగర్‌లో అమృత్‌లాల్ శుక్ల కార్మిక భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేష్ మాట్లాడుతూ..ప్రభుత్వం వెంటనే ఐకెపి సెంటర్లలో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి, గన్నిసంచులు అందుబాటులో ఉంచాలని కోరారు. రైస్ మిల్లర్లు రైతుల వద్ద నుండి ప్రతి సంచికి రెండు నుండి మూడు కిలోల వరకు అదనంగా ధాన్యం తీసుకుంటూ దోపిడీ చేస్తున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకొని, రైతులకు న్యాయం చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. గత సీజన్‌లో సేకరించిన సన్నబియ్యానికి బోనస్‌ను ప్రభుత్వం తక్షణమే అందించాలని, అలాగే ధాన్యం కొనుగోలు ఆలస్యం వల్ల రైతులు వర్షాల భయంతో ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకునే పరిస్థితి ఏర్పడుతోందని ఆయన తెలిపారు. ప్రైవేట్ వ్యాపారులు తేమ పేరుతో ఒక కింటకు 8 కిలోల వరకు కోతలు విధిస్తూ రైతులను నిలువునా దోచుకుంటున్నారని, ఇలాంటి మోసగాళ్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, రైస్ మిల్లుల లైసెన్సులు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, జవ్వాజి విమల, కోడం రమణ తదితరులు పాల్గొ న్నారు. అలాగే సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గన్నారం నరసయ్య, సూరం పద్మ, గురుజాల శ్రీధర్, శ్రీరాముల రమేష్ చంద్ర తదితరులు కూడా హాజరయ్యారు.

# విద్యార్థులారా మేల్కొనండి..!

విద్యార్థులు పదేళ్ల పాటు విషయాలు కట్టిపె ట్టుకోవడం ఎందుకు? అని ఆయన ప్రశ్నించారు. ఇవి కేవలం చదువుల రూపాన్నే కాదు, మొత్తం వ్యవస్థను పునరాలోచించాలని సూచించే వ్యాఖ్య లుగా కనిపిస్తున్నాయి. ఏఐ సాధనాలను సృజ నాత్మకంగా ఉపయోగించడం నేర్పడమే భవిష్యత్ విద్యలో అసలైన లక్ష్యమని ఆర్జీవీ తెలిపారు. విశ్వవిద్యాలయాలు మారే వరకు ఏఐ వేచి ఉండదని, మార్పును అందుకోలేని విధానాలను ఇది చెరిపేస్తుందని హెచ్చరించారు. పాఠశాలలు కూడా తమ బోధన పద్ధతులను మార్చుకుని, పరీక్షల్లో ఏఐని ఒక సహాయక సాధనంగా అనుమతించాలని ఆయన సూచించారు. ఏఐ మిమ్మల్ని చంపదు కేవలం పట్టించుకోదు అని చేసిన వ్యాఖ్యతో ఆర్జీవీ మరింత దృష్టిని ఆకర్షించారు. ఏఐని వాడలేని వారు భవిష్యత్తులో ఏఐ చేతనే వాడబడతారు అనే ఆయన హెచ్చరిక యువతలో ఆలోచనలకు దారి తీస్తోంది. సాంకేతిక మార్పుల దూకుడు వేగమవుతున్న ఈ సమయంలో విద్యా వ్యవస్థ ఏ దిశలో సాగాలన్న దానిపై ఈ ట్వీట్ విస్తృత చర్చకు కారణమవుతోంది.

# తెలంగాణ వక్ఫ్ బోర్డు పనితీరుపై మంత్రి అజరుద్దీన్ సమీక్ష

ఆక్రమణలు, రికార్డ్ డిజిటలైజేషన్, పారదర్శకత పెంపు వంటి అంశాలను మంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. వక్ఫ్ బోర్డు పనితీరును సిస్టమేటిక్‌గా బలోపేతం చేసేందుకు అవసరమైన పరిపాలనా సంస్కరణలపై సూచనలు అందించారు. ఆస్తుల భద్రత, ఆదాయ సాధన, మానిటరింగ్ వ్యవస్థను శక్తివంతం చేయడం వంటి కీలక చర్యలపై సూచనలు చేశారు. బోర్డు పనిచేసే విధానంలో స్పష్టత, వేగం, బాధ్యతాయుతత పెంచడంపై ఆయన దృష్టి పెట్టారు. వక్ఫ్ ఆస్తుల సరైన వినియోగం, కమ్యూనిటీ సంక్షేమం కోసం ఈ సమీక్ష కీలక దశగా నిలవనుందని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వక్ఫ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో కట్టుబడి ఉన్నట్లు మంత్రి అజరుద్దీన్ తెలిపారు.

# రెండు లారీల మధ్య నలిగిన కారు చెలరేగిన మంటలు

డెస్క్ : మహారాష్ట్రలోని పూణే-బెంగళూరు జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అదుపు తప్పిన కంటైనర్ లారీ పలు వాహనాలపైకి దూసుకెళ్లి, మరో లారీని ఢీకొట్టడంతో మధ్యలో ఉన్న కారు పూర్తిగా నలిగిపోయి మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో కారులో ఉన్న కుటుంబ సభ్యులతో పాటు మొత్తం 8 మంది దుర్మరణం చెందినట్లు అధికారులు తెలిపారు. నవాలే వంతెన సమీపంలో జరిగిన ఈ ఘటనలో మంటలు విపరీతంగా వ్యాపించడంతో కారులో ఉన్నవారు బయటపడే అవకాశం లేకుండా పోయింది. అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చినా, అప్పటికే ప్రాణనష్టం సంభవించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ప్రమాదంలో సుమారు 15 మంది గాయపడ్డారు. వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించగా, కొందరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. అందువల్ల మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రమాదం జరిగిన ప్రదేశం అత్యంత రద్దీగా ఉండడం వల్ల భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసు బలగాలు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను మళ్లించాయి. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

# భవిష్యత్ లో వరదలను తట్టుకునేలా చర్యలు

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**




భవిష్యత్ లో వరదలను తట్టుకునేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు నగర మేయర్ గుండు సుధారాణి తెలిపారు. గురువారం హన్మకొండ పరిధి లోని 31వ డివిజన్ హంటర్ రోడ్డులోని నందిహిల్స్ కాలనీ ప్రాంతాల్లో స్థానిక శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ లతో కలిసి సందర్శించారు. పై నుండి వచ్చే వర్షపు నీరు కాలనీ లలోకి చేరడం వల్ల కలిగే ఇబ్బందులను క్షేత్ర స్థాయి లో పరిశీలించారు. ఈ సందర్భంగా నగరంలో భవిష్యత్‌లో అకాల వర్షాల ప్రభావం వల్ల వరద నష్టాలు సంభవించకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మామిండ్ల రాజు,బల్దియా ఎస్ ఈ సత్యనారాయణ ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్ తో పాటు మాజీ కార్పొరేటర్ మోహన్ రావు,స్థానికులు జగన్ మోహన్ రెడ్డి, ఎల్ వి సుబ్బరాజు, పొగాకుల శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ గొంది జగన్, పసునూటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# సైబరాబాద్ హోమ్‌గార్డులకు ప్రత్యేక క్రెడిట్ సొసైటీ ప్రారంభం

- తెలంగాణలో తొలి హోమ్‌గార్డుల సహకార క్రెడిట్ సమాఖ్య
- ఆర్థిక సంక్షేమం, సామాజిక భద్రతకు నూతన భరోసా

**వేద న్యూస్, సైబరాబాద్ :**



సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో హోమ్‌గార్డుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన సైబరాబాద్ హోమ్ గార్డ్స్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ అధికారికంగా ప్రారంభమైంది. తెలంగాణలో హోమ్‌గార్డులకోసం ప్రత్యేకంగా స్థాపించబడిన ఇదే తొలి క్రెడిట్ సమాఖ్య కావడం విశేషం. సైబరాబాద్ పోలీసులు దీన్ని గర్వంగా ప్రారంభించినట్లు ప్రకటించారు. హోమ్‌గార్డుల ఆర్థిక సంక్షేమం, సామాజిక భద్రతపై దృష్టి సారించి ఈ క్రెడిట్ సొసైటీ రూపుదిద్దుకుంది. రుణ సౌకర్యాలు, అత్యవసర ఆర్థిక సహాయ పథకాలు, ఆదాయ భద్రతా పథకాలు వంటి సహకార సేవలను అందించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. ఈ సమాఖ్య ద్వారా సభ్యుల ఆర్థిక అవసరాలు సులభంగా నెరవేర్చే అవకాశముందని అధికారులు వెల్లడించారు. పోలీసు శాఖలో కీలక పాత్ర పోషించే హోమ్‌గార్డుల కోసం ఈ విధమైన సహకార వ్యవస్థ అవసరమని చాలా కాలంగా వినిపిస్తోన్న అభిప్రాయాలు ఇప్పుడు ఫలితంగా మారాయి. రోజువారీ విధుల్లో రిస్క్ తీసుకుంటున్న హోమ్‌గార్డులకు ఇది ఆర్థిక భరోసాను ఇవ్వనున్నదని అధికారులు చెప్పారు. ఈ క్రెడిట్ సొసైటీ ప్రారంభంతో హోమ్‌గార్డుల సామాజిక, కుటుంబ సంక్షేమం మరింత బలోపేతం కానుందని, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టే అవకాశముందని పోలీసులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఒలంపియాడ్ పోటీ పరీక్షలు విజయవంతం చేయండి

**వేద న్యూస్, మహబూబాబాద్ :**



శనివారం ఎల్టా తెలంగాణ ఎస్సీఈఆర్టీ, భారతి ఫౌండేషన్ వారి సహకారంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎజుక్వెస్ట్ మరియు ఇంగ్లీష్ ఒలంపియాడ్ పోటీ పరీక్షలు పాఠశాల స్థాయిలో వారి వారి పాఠశాలలో నిర్వహించ బడతాయని మహబూబాబాద్ జిల్లా ఎల్టా జనరల్ సెక్రెటరీ బయగాని రామ్మోహన్ అన్నారు. ఈ పరీక్షల ద్వారా విద్యార్థులలో సృజనాత్మక ప్రసంగాలు, ఆంగ్ల భాష నైపుణ్యాలను పెంపొందించడం జరుగుతుందని చెప్పారు. ఈ పరీక్షలలో 6,7,8 తరగతులను జూనియర్ కేటగిరీగా, 9,10 తరగతులను సీనియర్ క్యాటగరీగా తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ పోటీలలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మోడల్ స్కూల్ మరియు కేజీబీవీ పాఠశాలల విద్యార్థులు పాల్గొంటారని, అందువలన ఆయా పాఠశాలల ప్రిన్సిపల్స్, హెడ్మాస్టర్స్, స్పెషల్ ఆఫీసర్స్, ఆంగ్ల ఉపాధ్యాయులకు సహకరించి విద్యార్థుల ఆంగ్ల నైపుణ్యాన్ని పెంపొందించి, ఇంగ్లీష్ ఒలంపియాడ్ ని విజయవంతం చేయాలని కోరారు.

# రోడ్డు భద్రతా నియమాలు ప్రతి ఒక్కరి బాధ్యత

– ఎస్పీ శరత్ చంద్ర పవార్

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**




రోడ్డు ప్రమాదాల నివారణకు నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గురువారం చిట్యాల మండలం వెలిమినేడు హైవే వద్ద వాహన చోదకులకు జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవార్ “నీ వాహనం వేగంగా వెళ్తుంది.. కానీ నీ జీవితం ఆగిపోతుంది” అనే నినాదం ద్వారా యాక్సిడెంట్ కి గురైన కారును చూపుతూ హోల్డింగ్ ఏర్పాటు చేసి వాహన చోదకులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు.వాహన చోదకులు అతివేగం తో ప్రయాణించడం, సీట్ బెల్టు పెట్టుకోవడం, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేయడం, రాంగ్ రూట్లో ప్రయాణించడం మద్యం తాగి వాహనాలు నడపటం లాంటి అనేక తప్పిదాల వల్ల నిత్యం అనేక ప్రమాదాలకు గురై ఎంతో మంది క్షతగాత్రులు,మృత్యువాత పడుతున్నారని పేర్కొన్నారు. వాహన చోదకులు రోడ్డుపై ప్రయా ణించేటప్పుడు ఇలాంటి హోల్డింగులు చూడడం వల్లన వేగ పరిమితి మించకుండా, సీట్ బెల్ట్, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకుండా ఉండుటకు అవగాహన కలిగి ఉంటారని తద్వారా ప్రమాదాలను నివారించవచ్చునని అన్నా రు. వాహన దా రులు ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ రోడ్డుపైన ఉన్నటువంటి సూచికలను గమనిస్తూ సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలని సూచించారు. జిల్లా పోలీస్ శాఖ తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలు గుర్తించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రమాదాలు జరుగుటకు గల కారణాలు తెలుసుకొని వెంటనే తగు నియంత్రణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్గొండ డిఎస్పి శివరాం రెడ్డి, చిట్యాల సిఐ నాగరాజు, చిట్యాల ఎస్ఐ మధు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఎయిర్పోర్ట్ భూసేకరణలో జాప్యం జరగకూడదు



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**

ఓరుగల్లు ప్రజల విమానాశ్రయం కల త్వరలోనే నెరవేరబోతోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు. గురువారం ఎంపీ డాక్టర్ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ సత్య శారదతో కలసి మామునూర్ ఎయిర్ రన్ వే విస్తరణ పనులు పరిశీలించారు. సమర్ధ నిర్వహణకు ఇరిగేషన్, ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా నక్కల పల్లి చెరువు, గాడిపల్లి చెరువుల తో పాటు ఎయిర్ పోర్ట్ కు వెళ్ళే రోడ్లను సందర్శించి పరిశీలించారు. ప్రస్తుత వర్షపాతాన్ని దృష్టిలో ఉంచుకొని ఎయిర్పోర్ట్ పరిధిలో చేపట్టబోయే నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సంబంధించి మామునూరు ఎయిర్పోర్ట్. భూ సేకరణకు సంబంధించిన పనుల్లో జాప్యం లేకుండా చూడాలని అధికారులకు ఎంపీ సూచించారు. అనంతరం అధికారులు మ్యాప్ ద్వారా రన్ వే విస్తరణ పనులను ఎంపీకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో విమానాశ్రయం పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. మామునూరులో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు ప్రణాళిక రూపకల్పన చేయడం జరిగిందని అన్నారు. ప్రయాణికుల సేవలతో పాటు కార్గో సేవలను సైతం అందించేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. వరంగల్‌ను రాష్ట్ర రెండో రాజధానిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని అన్నారు. కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కు పక్కనే ఉన్నందున ఎయిర్ పోర్ట్ సర్వీసులు ప్రారంభమైతే వరంగల్ ప్రగతి లో దూసుకుపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ ఈఈ రాజేందర్, ఇరిగేషన్ డీఈ మధుసూదన్ రెడ్డి, తహసీల్దార్ ఇక్బాల్ అహ్మద్, ఏఈ రాజశేఖర్, సర్వేయర్ రజిత తదితరులు పాల్గొన్నారు.

# క్లినిక్‌కు రిజిస్ట్రేషన్ లేదు

– మూసివేయండి డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు

**వేద న్యూస్, జమ్మికుంట:**




జమ్మికుంట పట్టణంలో సెరా లైఫ్ అనే పేరుతో నడుస్తున్న క్లినిక్ ను గురువారం హుజూరాబాద్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ చందు ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా ఎలాంటి రిజిస్ట్రేషన్ లేకుండా క్లినిక్ నడుపుతున్నారని, చట్టపరంగా రిజిస్ట్రేషన్ చేసుకొని క్లినిక్ ను నడుపుకోవాలని రిజిస్ట్రేషన్ వచ్చే వరకు క్లినిక్ ను మూసివేయాలని క్లినిక్ ను నడుపుతున్న వ్యక్తికి సూచించారు. ప్రజలు ఎవరైనా అర్హత గల వైద్యులచే వైద్యం చేయించుకోవాలని, అర్హత లేని వైద్యులచే వైద్యం చేసుకోవద్దని తెలిపారు. ప్రజలందరూ ప్రభుత్వ వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాజేందర్ రాజు సబ్ యూనిట్ ఆఫీసర్, సిబ్బంది నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# టెట్ నోటిఫికేషన్ విడుదల

– నవంబర్ 15 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం


**వేద న్యూస్, హైదరాబాద్ :**

తెలంగాణలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) 2025 రెండో విడత నోటిఫికేషన్ విడుదలైంది. స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ గురువారం అధికారికంగా ప్రకటన చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా అభ్యర్థులు దరఖాస్తులకు సిద్ధం కావాలని సూచించింది. నవంబర్ 15 నుంచి టెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుండగా, నవంబర్ 29వ తేదీతో ఆన్‌లైన్ అప్లికేషన్ ప్రక్రియ ముగియనుంది. జనవరి 3 నుంచి 31 వరకు టెట్ పరీక్షలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. పరీక్షల షెడ్యూల్, విధానం, సిలబస్, హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ తేదీల విషయంగా త్వరలో మరిన్ని వివరాలు విడుదల చేయనున్నట్లు సమాచారం. టెట్ అర్హత ఆధారంగా భవిష్యత్ టీచర్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో అవకాశం పొందే అవకాశం ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ఈ ఏడాదిలో టెట్ కోసం ఇది రెండో విడత నోటిఫికేషన్. మొదటి విడత టెట్ నోటిఫికేషన్ జూన్‌లో విడుదల కాగా, పరీక్షలు ఇప్పటికే పూర్తయ్యాయి. జులై 22న ఫలితాలు కూడా ప్రకటించడంతో వేలాది మంది అభ్యర్థులు అర్హత సాధించారు. రెండో విడతను కూడా భారీ స్థాయిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇక ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ టెట్ అర్హత తప్పనిసరిగా సాధించాలని సుప్రీం కోర్టు ఇటీవల తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. తమ ఉద్యోగాల్లో కొనసాగాలంటే టెట్ ఉత్తీర్ణత అవసరమని న్యాయస్థానం స్పష్టంగా పేర్కొనడంతో, ఈసారి టెట్‌కు ఉపాధ్యాయుల నుంచి కూడా పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంది.

# అమ్మ ఆస్పత్రిలో మెగా క్యాంప్

– 16న అందుబాటులో ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ రఘుపతి

**వేద న్యూస్, జమ్మికుంట:**




అమ్మ సూపర్ స్పెషాలిటీలో ఈ నెల 16న(ఆదివారం) మెగా క్యాంప్ నిర్వహిస్తున్నట్టు ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ బొజ్జం సంతోష్ రెడ్డి ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఆదివారం ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ ఓరుగంటి రఘుపతి అందుబాటులో ఉంటారని వెల్లడించారు. ఆ రోజు మొదటి 50 మందికి ఉచితంగా ఓపీ చూడబడునని, ల్యాబ్ పరీక్షలలో ధర 20 శాతం తగ్గింపు ఉంటుందని చెప్పారు. షుగర్, థైరాయిడ్, హార్మోన్స్ సమస్యలు ఉన్న వారు అమ్మ ఆస్పత్రిని సంప్రదించాలని సూచించారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073

# అర్ధరాత్రి క్షమాపణ..!

- మంత్రి కొండా సురేఖపై కేసు విత్‌డ్రా చేసుకున్న నాగార్జున
- కొండా సురేఖ బహిరంగ క్షమాపణతో పరువునష్టం దావా కేసు ఉపసంహరించుకున్న నాగార్జున




**వేద న్యూస్, హైదరాబాద్ :**

తెలంగాణ మంత్రి కొండా సురేఖపై వేసిన పరువు నష్టం దావాను ప్రముఖ నటుడు నాగార్జున ఉపసంహరించుకున్నారు. తమ కుటుంబంపై అసభ్యకర వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో నాగార్జున గతంలో దాఖలు చేసిన కేసులో మంత్రి సురేఖ క్షమాపణ చెప్పిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. 2024 అక్టోబర్ 2న లంగర్‌హౌస్‌లో జరిగిన మీడియా సమావేశంలో మంత్రి సురేఖ, నాగచైతన్య–సమంత విడాకుల విషయంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసి, కేటీఆర్ కారణమని సంచలన ప్రకటన చేశారు. ఈ వ్యాఖ్యలు రాజకీయంగానే కాక సినీ రంగంలో కూడా పెద్ద దుమారం రేపాయి. అక్కినేని కుటుంబ ప్రతిష్ఠ దెబ్బతినేలా వ్యాఖ్యానించారంటూ నాగార్జున, బీఎన్ఎస్ సెక్షన్ 356 కింద క్రిమినల్ చర్యలు తీసుకోవాలని నాంపల్లి స్పెషల్ కోర్టులో పరువు నష్టం దావా దాఖలు చేశారు. ఈ కేసు విచారణ గురువారం నాంపల్లి కోర్టులో జరిగింది. విచారణకు ముందే మంత్రి కొండా సురేఖ అక్కినేని కుటుంబానికి సోషల్ మీడియా వేదికగా రెండు మార్లు బహిరంగ క్షమాపణలు తెలిపారు. అదే విషయాన్ని కోర్టులోనూ స్పష్టం చేసారు. దీనితో పరిస్థితిని సానుకూల దిశగా తీసుకువెళ్లేందుకు నాగార్జున కేసును ఉపసంహరించుకోవాలని నిర్ణయిం చారు. సురేఖ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా, వ్యక్తిగతంగా తీవ్రంగా విమర్శలు ఎదుర్కొన్న నేపథ్యంలో, ఈ కేసు ఉపసంహరణ రెండు వర్గాల మధ్య వివాదానికి ముగింపు పలికినట్టేనని విశ్లేషకులు భావిస్తున్నారు.

# సంక్షోభంలోకి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ

- రైతుల బాగు మరిచిన రాష్ట్ర సర్కారు
- తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కిషన్ రావు




**వేద న్యూస్, వరంగల్:**

రైతుల ఆర్థిక స్థితి రోజురోజుకూ క్షీణిస్తూనే ఉందని, రైతుల పట్ల నిర్లక్ష్యం ఇలాగే కొన సాగితే, భవిష్యత్తులో వ్యవసాయ రంగం పతనమవ్వడమే కాక, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మొత్తం సంక్షోభంలో పడే ప్రమాదం ఉందని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కిషన్ రావు వరికెల హెచ్చరించారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటన రిలీజ్ చేశారు. రాష్ట్ర జనాభాలో 50 శాతానికి పైగా వ్యవసాయం పై ఆధారపడి జీవిస్తున్నప్పటికీ, ఏ ఒక్క రైతు కూడా తన పేరున కానీ, తన కుటుంబ సభ్యుల పేరున గాని బ్యాంకులలో కనీసం రూ.5 వేల ఫిక్స్ డ్ డిపాజిట్‌గా దాచు కోలేదని, ప్రైవేట్ అప్పుల పాలై జీవితకాలం వారి సంపాదనలో అధిక శాతం వడ్డీలు చెలిస్తూ దుర్భర జీవితం గడుపు తున్నారని పేర్కొన్నారు. ఈ సంవత్సరపు వర్ష కాలపు అతి భారీ వర్షాలకు, లక్షలాది ఎకరాలలో పంటలు దెబ్బతిని రైతులు ఆర్థికంగా కోలుకోలేని విధంగా నష్టపోయారని చెప్పారు. ఇలాంటి పరిస్థితులలో వస్తదో, రాదో అని తెలువని అతి కొద్దీ సహాయం కొరకు ప్రభుత్వ దయ, దాక్షిణ్యాల పైన ఆధారపడవలిసిన అవుసరం లేకుండా పంటల బీమా పథకం ద్వారా రైతులను ఆదుకొనే వీలున్నప్పటికీ, రాష్ట్రంలో పంటల బీమా పథకం అమలు ఆవశ్యకత గురించి ఎన్నో మార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఆ దిశలో ప్రభుత్వం ముందడుగు వేయలేదని వెల్లడించారు. ప్రైవేట్ అప్పుల అధిక వడ్డీ భారం నుంచి రైతును కాపాడ డానికి రిజర్వు బ్యాంకు మార్గ దర్శకాల ప్రకారం, హై కోర్ట్ ఆదేశాల ప్రకారం బ్యాంకుల ద్వారా రుణ మార్పిడి రుణాలు (డెబిట్ స్వాపింగ్ లోన్స్) మంజూరు చేసే అవకాశం ఉన్నదని ఎన్నో మార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఫలితంగా నష్టాలను భరిస్తు మౌనంగా రైతు దుర్భర జీవితం గడప వలసి వస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను సవాలుగా స్వీకరించి, రైతుల ఆర్థిక స్థితి మెరుగుపరచడానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను తక్షణమే ప్రకటించాలని కోరారు. వ్యవసాయ రంగ సమస్యల గురించి, వాటి పరిస్కారాల గురించి మొత్తం తమకే తెలుసునని భావించ వద్దని, ఇప్పటికైనా రైతు సంఘాలు, రైతు నాయకులతో చర్చలు జరిపి, రైతు ఆర్థిక పునరుద్ధరణ కోసం తక్షణ చర్యలు చేపట్టాలని తెలంగాణ రైతు రక్షణ సమితి పక్షాన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్టు వెల్లడించారు.

# జనం దవాఖాన 'రిషిక'

- ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సేవలు
- తల్లీబిడ్డల క్షేమమే లక్ష్యంగా వైద్య సేవలు
- హాస్పిటల్‌లో అత్యాధునిక పరికరాలు



**వేద న్యూస్, జమ్మికుంట:**

పేదలు, మధ్యతరగతి వారికి తక్కువ ధరలో వైద్యం అందిస్తూ.. నిత్యం అందు బాటులో ఉంటూ రిషిక తల్లి పిల్లల ఆస్పత్రి జనం దవా ఖానగా పేరు గాంచింది. ముఖ్యంగా రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా నిరు పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలకు ఉచిత వైద్య సేవలను అందిస్తు న్నారు. కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ప్రజలకు అందిస్తుండటంతో 24/7 సరసమైన ధరలతో అందుతుండటంతో జనం సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**సేవా మార్గంలో ముందుకు..**

కొత్తకొండ వీరన్న కొలువు దీరిన భీమదేవరపల్లి మండలం కొత్తకొండకు సమీపంలోని మారుమూల గ్రామానికి చెందిన కుటుంబంలో జన్మించిన రమేశ్..వైద్యుడిగా చక్కటి సేవలను ప్రజలకు అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన వ్యక్తి అయిన రమేశ్.. ప్రజలకు చక్కటి కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని సరసమైన ధరలోనే అందించాలనే లక్ష్యంతోనే జమ్మికుంట పట్టణంలో ఆస్పత్రిని ప్రారంభించి.. ప్రజల ఆదరాభిమానాలతో ముందుకు సాగుతున్నారు. ఆస్పత్రి ప్రారంభించి ఏడేండ్లు విజయవంతంగా పూర్తి కాగా, ఈ కాలంలో ఎంతో మంది పిల్లలకు చక్కటి సేవలందించారు. ఎండీ (పీడియాట్రిక్స్) పీజీపీఎన్ బోస్టన్ యూనివర్సిటీ యూఎస్ఏ(అమెరికా)లో పూర్తి చేసిన డాక్టర్ బి.రమేశ్..సేవే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు. తల్లీబిడ్డ ఒకే చోట క్షేమంగా ఉండేలా రిషిక తల్లి పిల్లల ఆస్పత్రిలో ఉత్తమ శిశు, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రమేశ్ , స్త్రీల, ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ కె.జ్యోతిరెడ్డి అందుబాటులో ఉంటున్నారు.

**పేదలకు ఆర్థిక భారం పడకుండా 'ఆరోగ్యశ్రీ'తో సర్వీస్**

గర్భం అందిన నాటి నుంచి డెలివరీ అయ్యే వరకు సలహాలు, సూచనలు అందిస్తూ..



ల్యాపరోస్కోపిక్ సర్జన్, ఇన్ఫెర్టిలిటీ స్పెషలిస్ట్, స్త్రీల, ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ కె.జ్యోతిరెడ్డి.. ఎంఎస్(ఓబీజీ), ఎఫ్ఎంఏఎస్, డీఎంఏఎస్.. చక్కటి సర్వీస్ ఇస్తున్నారు. గర్భిణులు ఎలాంటి ఆహారం తీసుకోవాలి? పిల్లలకు పాలు ఏ రకంగా అందించాలి? వంటి విషయాలన్నింటినీ సవివరంగా తెలుపుతూ తల్లీబిడ్డ క్షేమమే ధ్యేయంగా సూచనలు ఇస్తున్నారు. ప్రతి మంగళవారం ఆస్పత్రిలో ఆడవారికి ఉచిత ఓపీ చూడనున్నారు. నిపుణులైన వైద్యులు ఇద్దరు 24/7 అందుబాటులో ఉండే రిషిక ఆస్పత్రిలో చక్కటి సేవలు అందుతున్నాయని అక్కడ డెలివరీ అయిన గర్భిణులు చెబుతున్నారు. ఇక పేదలకు ఆరోగ్యం విషయంలో ముఖ్యంగా ట్రీట్‌మెంట్‌కు సంబంధించి ఆర్థిక భారం పడకుండా సదరు ఆస్పత్రిలో 'ఆరోగ్యశ్రీ' అందుబాటులో ఉన్నది. పస్కలతో పాటు ఆరోగ్య శ్రీలో కవర్ అయ్యే వ్యాధులకు ట్రీట్‌మెంట్ పేదలకు పైసాఖర్చు లేకుండా అందనుంది.

**అడ్వాన్స్‌డ్ ఫెసిలిటీస్**

రిషిక తల్లిపిల్లల ఆస్పత్రిలో ప్రముఖ వైద్యులు, శిశు, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ బి.రమేశ్.. శిశువు నుంచి 18 ఏండ్ల వయసున్న పిల్లలు ప్రతీ ఒక్కరి ఆరోగ్య సం'రక్షణే' కర్తవ్యంగా వైద్య సేవలు అందిస్తున్నారు. ఆస్పత్రిలో అడ్వాన్స్‌డ్ ఎన్ఐసీయూ, పీఐసీయూ, ఆపరేషన్ థియేటర్, ఏసీ రూములు, ఫొటో థెరపీ, ఇంక్యుబేటర్, వార్మర్, సెంట్రల్ ఆక్సిజన్, పీడియాట్రిక్ సర్జరీస్‌కు సంబంధించి అన్ని రకాల ఫెసిలిటీస్ అందుబాటులో ఉన్నాయి. జాతీయ స్థాయి డాక్టర్ రత్న అవార్డు గ్రహీత డాక్టర్ బి.రమేశ్ సారథ్యంలో తల్లీ బిడ్డ ఒకే చోట క్షేమంగా ఉండేలా రిషిక తల్లిపిల్లల ఆస్పత్రిలో సేవలు అందుతున్నాయని పలువురు పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొట్టమొదటి సారిగా ఆరోగ్యశ్రీ స్కీమ్ ద్వారా పేదవారికి వైద్యం అందించిన ఘనత డాక్టర్ బి.రమేశ్‌కే దక్కుతుంది. రిషిక తల్లిపిల్లల ఆస్పత్రిలో నిపుణులైన వైద్యులు, సిబ్బంది చక్కటి సేవలందిస్తూ..చక్కటి పేరు గడించారు.

# నేడే ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు



**వేద న్యూస్, హైదరాబాద్ :**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు శుక్రవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని రిటర్నింగ్ ఆఫీసర్ కర్ణన్ ప్రకటించారు. నవంబర్ 11న పోలింగ్ ప్రశాంతంగా ముగియగా, ఫలితాల కోసం కీలక కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. లెక్కింపు కేంద్రంలో అనుమతులు ఉన్నవారికి మాత్రమే ప్రవేశం ఉంటుందని ఆర్వో స్పష్టం చేశారు. నేడు మొదట పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు చేపట్టి, అనంతరం ఈవీఎం ఓట్లను లెక్కింపు టేబుళ్లకు తరలించనున్నట్లు ఆర్వో పేర్కొన్నారు. మొత్తం 407 పోలింగ్ కేంద్రా లకు సంబంధించిన ఓట్లను లెక్కించాల్సి ఉండటంతో భారీ స్థాయిలో ఏర్పాట్లు చేశారు. 58 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నందున, ప్రత్యేక అనుమతితో 42 కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ ప్రక్రియను 10 రౌండ్లలో పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. లెక్కింపుకు మొత్తం 186 మంది సిబ్బందిని నియమించినట్లు ఆర్వో కర్ణన్ తెలిపారు. ఫలితాలను ఎన్నికల సం ఘం వెబ్‌సైట్‌లో రౌండ్ వారీగా అప్‌డేట్ చేస్తామని, మీడియా సౌకర్యార్థం ప్రత్యేక డిస్‌ప్లేలను ఏర్పాటు చేశామని వివరించారు. ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద కఠిన భద్రతా బందోబస్తు అమలు చేశారు. నగర జాయింట్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్ మాట్లాడుతూ 250 మంది పోలీసు సిబ్బందితో పాటు 15 ప్లాటూన్లను రంగంలోకి దింపుతున్నట్లు చెప్పారు. లెక్కింపు కేంద్ర పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, శాంతి భద్రత లకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలు రేపు మధ్యాహ్నానికి స్పష్టమవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

# పాలేరు రిజర్వాయర్‌లో చేప పిల్లల విడుదల

- మత్స్యకార కుటుంబాల జీవనోపాధికి ప్రభుత్వం అండగా నిలుస్తున్నామన్న మంత్రి పొంగులేటి
- రాష్ట్రవ్యాప్తంగా 101 రిజర్వాయర్లలో పెద్ద సైజు రొయ్య పిల్లల విడుదలకు సిద్ధం



**వేద న్యూస్, ఖమ్మం :**

ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గ పర్యటనలో భాగంగా పాలేరు రిజర్వాయర్‌లో చేప పిల్లలను విడుదల చేసినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. మత్స్య వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తూ, వారి జీవనోపాధిని బలోపేతం చేస్తోందని ఆయన తెలిపారు. మత్స్యకార సంఘాల అభ్యర్థన మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 101 రిజర్వాయర్లలో పెద్ద సైజు రొయ్య పిల్లలను రాబోయే 15 రోజుల్లో ప్రభుత్వం విడుదల చేయనుందని ఆయన తెలిపారు. చేపల ఉత్పత్తి పెరిగి, మత్స్యకారుల ఆదాయం గణనీయంగా పెరుగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. "ప్రతి కులం, ప్రతి వర్గం గౌరవంతో జీవించేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది. పేదల అభివృద్ధి మా మొదటి లక్ష్యం" అని పొంగులేటి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సుమారు 23 నెలలలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రగతి, సంక్షేమ పథకాలు వేగంగా అమలవుతున్నాయని ఆయన అన్నారు. కాంగ్రెస్ అంటే పేదల పక్షపాతిగా, అండగా నిలిచే పార్టీ అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఫిషరీస్ గోట్స్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, జిల్లా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, మత్స్యకార సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# ఇంట్రెస్టింగ్ ట్రైలర్ - 'రాజు వెడ్స్ రాంబాయి' ట్రైలర్ రిలీజ్

**వేద న్యూస్, డెస్క్:**

సిల్వర్ స్క్రీన్‌పై ఇప్పటివరకు మంచి సందేశాన్నిచ్చిచ్చే చాలా ప్రేమకథలు వచ్చాయని తెలిసిందే. అదే జోనర్‌లో వస్తున్న ప్రాజెక్ట్ రాజు వెడ్స్ రాంబాయి. సాయిలు డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీలో అఖిల్ ఉడ్డెమారి, తేజస్వి (కమిటీ కుర్రోళ్లు ఫేం) హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈటీవీ ఒరిజినల్ మూవీగా వస్తోన్న ఈ చిత్రం నవంబర్ 21న థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ట్రైలర్ లాంచ్ చేశారు.హీరో క్యారెక్టర్ బ్యాండ్ బాజా మోగించే సీన్లతో మొదలైంది ట్రైలర్.. ఇక రాజు నువ్వెప్పుడు బ్యాండ్ కొడుతూనే ఉండు. మనకు పెళ్లైనా.. పిల్లలు పుట్టినా.. మనం ముసలోళ్లమైనా బ్యాండ్ కొడుతనే ఉండు సరే నా అంటూ హీరోయిన్ చెబుతున్న సాగుతున్న డైలాగ్స్ ఇంప్రెసివ్‌గా ఉన్నాయి.ఊళ్లో బ్యాండ్ కొట్టి జీవనం సాగించే రాజు అనే యువకుడికి చదువుకునే రాంబాయి అనే యువతికి మధ్య లవ్ ట్రాక్ నేపథ్యంలో సినిమా ఉండబోతున్నట్టు ట్రైలర్ హింట్ ఇచ్చేస్తుంది. ప్రేమ, పెళ్లి.. వాటి ద్వారా ఎదురయ్యే సమస్యలను చూపిస్తూ యూత్‌ను ఆలోచింపజేసేలా సినిమాను తెరకెక్కించినట్టు ట్రైలర్ ద్వారా తెలిసిపోతుంది. ఈ చిత్రానికి విరాటపర్వం డైరెక్టర్ వేణు ఊడుగుల వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు.



వేద న్యూస్ శుక్రవారం నవంబర్ 14, 2025

# చేతిపై ముద్దు

## రష్మికతో విజయ్ రిలేషన్ కన్‌ఫాం ?



**వేద న్యూస్, డెస్క్:**

'ది గర్ల్ ఫ్రెండ్' మూవీతో మరోసారి ప్రేక్షకుల మనసులను గెలుచుకున్న రష్మిక మందాన్నతాజాగా హాట్ టాపిక్ అయింది. రాహుల్ రవీంద్రన్ దర్శక త్వంలో, దీక్షిత్ శెట్టి హీరోగా నటి ంచిన ది గర్ల్ ఫ్రెండ్ చిత్రాన్ని గీతా ఆర్ట్స్‌పై ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ నిర్మించారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా మంచి విజయాన్ని సాధించింది. ఈ క్రమంలో హైదరాబాద్‌లో జరిగిన సక్సెస్ మీట్ వేడుక ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఈ ఈవెంట్‌కి రష్మిక మందాన్న స్నేహితుడు, స్టార్ హీరో విజయ్ దేవరకొండ హాజరయ్యాడు. ఈ సక్సెస్ మీట్‌లో అనూహ్య సన్నివేశం చోటు చేసుకుంది. విజయ్ దేవరకొండ రష్మిక చేతిని పబ్లిక్‌లోనే ముద్దు పెట్టాడు. ఈ సన్నివేశం చూసిన ప్రేక్షకులు చప్పట్లు కొడుతూ ఆడిటోరియం దద్దరిల్లేలా చేశారు.ఆ సమయంలో రష్మిక కూడా సిగ్గుపడుతూ బ్లష్ అవ్వడం అభిమానులను మరింత ఆకట్టు కుంది.ఇద్దరి మధ్య రిలేషన్ ఉన్నట్లు, ఇటీవలే ఎంగేజ్‌మెంట్ కూడా జరిగిందని సోషల్ మీడియాలో వార్తలు తెగ వైరల్ అవుతు న్నాయి. అయితే ఇప్పటివరకు రష్మిక గానీ, విజయ్ దేవరకొండ గానీ అధికారికంగా స్పం దించలేదు. కానీ ఈ సక్సెస్ మీట్‌లో చోటు చేసుకున్న ఈ రొమాంటిక్ మూమెంట్ ఫ్యాన్స్ లో కొత్త ఊహాగానాలకు తావిచ్చింది. 'ది గర్ల్ ఫ్రెండ్'లో రష్మిక మందాన్న నటనపై ప్రేక్షకులు, విమర్శకులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఆమె ఎమోషనల్ సీన్స్, న్యాచురల్ ఎక్స్‌ప్రెషన్స్ సినిమాకు బలమని అభిమానులు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం విజయ్ దేవరకొండ.. రష్మికకు ముద్దు పెట్టిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, ట్రెండింగ్ టాపిక్‌గా మారింది. ఫ్యాన్స్ అయితే, "ఇది రీల్ కాదు, రియల్ లవ్ స్టోరీ" అంటూ కామెంట్స్ చేస్తున్నారు.మొత్తం మీద, 'ది గర్ల్ ఫ్రెండ్' సక్సెస్ మీట్ రష్మిక – విజయ్ దేవరకొండ జంట రొమాంటిక్ మూమెంట్‌తో మరింత హైలైట్ అయ్యారు. ఇక ఈవెంట్‌లో రష్మిక మాట్లాడుతూ.. మనలైఫ్‌లో విజయ్ దేవరకొండ లాంటి వారు ఉండటం ఒక వరం అని తెలిపింది. ప్రతి ఒక్కరి జీవితంలో విజయ్ లాంటి వారు ఉండాలని ఆమె చెప్పడం అందరిలో కొత్త అనుమానాలు కలిగిస్తున్నాయి. విజయ్ తనని మొదటి నుంచి ప్రోత్సహిస్తూనే ఉన్నాడని, ఈ సినిమా విజయంలోనూ భాగస్వామి అయ్యాడని, ఈ సినిమా మొత్తం జర్నీలో తన వెంటే ఉన్నాడని, అన్ని రకాలుగా అండగా నిలిచాడంటూ రష్మిక చెప్పడం కొసమెరుపు.

# రైతుల సమస్యలపై కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ

**వేద న్యూస్, హైదరాబాద్ :**



తెలంగాణ రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వానికి మరోసారి లేఖ రాసి అత్యవసర చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సోయాబీన్, మొక్కజొన్న, పత్తి పంటల కొనుగోళ్లలో చోటుచేసుకుంటున్న సాంకేతిక సమస్యలు, నాణ్యత ప్రమాణాల కఠినత రైతులకు పెద్ద నష్టాన్ని కలిగిస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు. 'మొంథా' తుఫాను, అకాల వర్షాలకు పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, సోయాబీన్ లో ఎఫ్ఏక్యూ ప్రమాణాలలో ప్రత్యేక సడలింపులు ఇవ్వాలని మంత్రి తుమ్మల కేంద్రానికి సూచించారు. వర్షాల ప్రభావంతో గింజల్లో రంగు మారడం, ముడతలు రావడం వంటి సమస్యలు తలెత్తాయని, ఈ పరిస్థితుల్లో సంస్థలు నాణ్యత ప్రమాణాలను మార్చకుండా కొనుగోలు చేపట్టడం రైతులపై అన్యాయం అవుతుందని అన్నారు. అందుకే కొనుగోళ్లకు తక్షణ నాణ్యత సడలింపుల ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 3.66 లక్షల ఎకరాల్లో సోయాబీన్ సాగు జరగగా, ఎకరాకు సగటు 7.62 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని ఆయన వివరించారు. మొక్కజొన్న కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 48,757 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి 14,519 మంది రైతులకు లాభం చేకూర్చిందని తెలిపారు. కనీస మద్దతు ధర కింద మొత్తం 16.85ఓ లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేయడానికి కేంద్రం సంస్థలకు అనుమతి ఇవ్వాలని తుమ్మల డిమాండ్ చేశారు. పత్తి కొనుగోళ్లలో ఎకరాకు 7 క్వింటాళ్ల పరిమితి రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తోందని, ఈ పరిమితిని కేంద్రం రద్దు చేయాలని ఆయన కోరారు. తేమ శాతం సడలించి, ఎకరాకు 11.74 క్వింటాళ్ల వాస్తవ దిగుబడి ఆధారంగా కొనుగోళ్లు కొనసాగించాలని సూచించారు. పత్తి, సోయాబీన్, మొక్కజొన్న రైతులు వరుసగా నష్టాలను ఎదుర్కొంటున్నందున వారిని రక్షించేందుకు తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని కేంద్రానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

# 'శివ' విలన్ మోహన్ బాబు?

## – ఆర్జీవీ ఫస్ట్ అనుకున్నారా?

**వేద న్యూస్, డెస్క్:**



టాలీవుడ్ చరిత్రలో సెన్సేషన్ సృష్టించిన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తొలి చిత్రం 'శివ' మళ్లీ వెండితెరపై మెరవడానికి సిద్ధమైంది. 1989 అక్టోబర్ 5న విడుదలైన ఈ చిత్రం తెలుగు సినీ పరిశ్రమలో విప్లవాత్మక మార్పు తీసుకువచ్చింది. అక్కినేని నాగార్జున, అమల ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం అంచనాలు లేకుండా విడుదలై అద్భుత విజయాన్ని సాధించింది. ఆ సమయంలో నాగార్జున పూర్తి స్థాయి స్టార్‌గా ఎదుగుతుండగా, వర్మకు ఇది తొలి సినిమా. అయి నప్పటికీ, మౌత్‌టాక్‌తో ఈ సినిమా భారీ బ్లాక్‌బస్టర్‌గా మారి నిర్మాత అక్కినేని వెంకట్‌ని ఆశ్చర్యపరిచింది. మొదటి రోజు ఉదయం షోకు తక్కువ ఆక్యుపెన్సీ ఉన్నప్పటికీ, రెండో షో నుండి ప్రేక్షకులు థియేట ర్లకు పోటెత్తారు. సాయంత్రానికి హౌస్‌ఫుల్ బోర్డులు వేలాడుతూ, అదనపు థియేటర్ల కోసం బయ్యర్లు డిమాండ్ చేశారు.'శివ' సినిమా కేవలం వసూళ్లు మాత్రమే కాదు, తెలుగు సినిమాకు కొత్త దిశ చూపింది. ఇళయరాజా సంగీతం, ఆర్జీవీ రియలిస్టిక్ టేకింగ్, ఆకట్టు కునే కథనం అన్నీ కలసి కొత్త తరహా సినిమాకు నాంది పలికాయి. ఆ తర్వాత 1990లో హిందీలోనూ 'శివ' రీమేక్ చేసి విజయాన్ని అందు కుంది. ఈ చిత్రం నాగార్జునకు స్టార్ ఇమేజ్, వర్మకు డైరెక్టర్‌గా గుర్తింపు తెచ్చింది. ఇప్పుడు, సినిమా విడుదలై 36 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా, ఈ కల్ట్ క్లాసిక్‌ను క్వాలిటీతో నవంబర్ 14న రీ-రిలీజ్ చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. ఈ సంద ర్భంగా నాగార్జున, రామ్ గోపాల్ వర్మ షూటింగ్ సమయంలో జరిగిన ఆసక్తికర సంఘటనలను పంచుకున్నారు.'శివ' సినిమాలో హీరోకి సమానంగా నిలిచిన పాత్ర గణేష్. ఆ పాత్రలో నటించిన విశ్వనాథ్ అద్భుతంగా నటించి ప్రేక్షకుల మన్ననలు పొందారు. అయితే ఆ పాత్రను మొదటగా మోహన్ బాబుకు ఆఫర్ చేశారని, కానీ రామ్ గోపాల్ వర్మ మాత్రం నో చెప్పారట. మోహన్ బాబు ఆ పాత్ర చేస్తే ప్రేక్షకులు పాత్రను కాకుండా నటుడినే చూస్తారు. కొత్త ముఖం ఉంటే రౌడీగా నిజంగా నమ్ముతారు అని వర్మ చెప్పడంతో విశ్వనాథ్‌ను ఎంచు కున్నారట. ఆ నిర్ణయమే సినిమాకు బలం చేకూర్చింది. ఇప్పుడు, 36 ఏళ్ల తర్వాత 'శివ' మళ్లీ పెద్ద తెరపై సందడి చేసేందుకు సిద్ధమైంది. పవర్ ఫుల్ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్, యాక్షన్ సీన్స్, ఆ కొత్తదనాన్ని మరోసారి థియేటర్లో అనుభవించేందుకు అభిమానులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.

# వాట్సన్ నయా అవతార్

## – కేకేఆర్ అసిస్టెంట్ కోచ్‌గా నియామకం..!




**వేద న్యూస్, డెస్క్:**

ఐపీఎల్ 2026 మినీ వేలానికి ముందు కోల్‌కతా నైట్‌రైడర్స్ కీలక నిర్ణయం తీసు కుంది. ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు షేన్ వాట్సన్‌ను కేకేఆర్ జట్టులోకి తీసుకుంది. మాజీ ఆల్‌రౌండర్ కేకేఆర్ జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా వ్యవహరిస్తాడని గురువారం వెల్లడి ంచింది. ఆస్ట్రేలియా తరఫున 59 టెస్టులు, 190 వన్డేలు, 58 టీ20 ఇంటర్నేషనల్ మ్యాచులు ఆడిన వాట్సన్.. ఇంటర్నేషనల్ కెరీర్‌లో 10వేలకుపైగా పరు గులు చేశాడు. మూడు ఫార్మాట్లలో కలిపి 280 కంటే ఎక్కువ వికెట్ల పడగొట్టాడు. వాట్సన్ 2007, 2015లో ప్రపంచకప్ గెలిచి ఆస్ట్రేలియా జట్టులో కీలకపాత్ర పోషించాడు. 2008 నుంచి 2020 వరకు ఐపీఎల్‌లో పలు జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. ఐపీఎల్‌లో 145 మ్యాచ్‌లు ఆడాడు. రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్ తరఫున బరిలోకి దిగాడు. క్రికెట్ నుంచి రిటైర్ అయ్యాక వాట్సన్ ప్రపంచవ్యాప్తంగా టీ20 లీగ్‌లో కోచ్, మెటర్ పాత్రలు పోషించాడు.కేకేఆర్ అసిస్టెంట్ కోచ్‌గా అవతారమెత్తిన వాట్సన్.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేకేఆర్ కోచింగ్ గ్రూప్, ప్లేయర్స్‌తో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపాడు. కోల్‌కతాకు మరో టైటిల్‌ను తీసుకు వచ్చేందుకు తాను ఎదురు చూస్తున్నానని చెప్పాడు. కేకేఆర్ సీఈవో వెంకీ మైసూర్ మాట్లాడుతూ వాట్సన్‌ను కేకేఆర్ ఫ్యామి లీలోకి స్వాగతించడానికి సంతోషిస్తున్నా మన్నారు. ఆటగాడిగా, కోచ్‌గా అతనికున్న అనుభవం జట్టుకు ఎంతో దోహ దపడు తుందని చెప్పాడు. అభిషేక్ నాయర్‌ను కేకేఆర్ ఇటీవల హెడ్‌కోచ్‌గా నియ మిం చింది. ముంబయి మాజీ ఆల్ రౌండర్ అయిన నాయర్‌కు కేకేఆర్‌తో చాలా రోజు లుగా అనుబంధం ఉన్నది. అయితే, ఐపీఎల్ 2025లో జట్టు ప్రదర్శన పేలవంగా ఉండగా.. కేకేఆర్ జట్టును బలోపేతం చేయా లని భావిస్తుంది. కేకేఆర్ గత సీజన్‌లో ఆడిన 14 లీగ్ మ్యాచుల్లో కేవలం ఐదింట్లో గెలిచింది. ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించ లేకపోయింది.

# లవ్ బర్డ్స్! - అనిరుధ్- కావ్య మారన్ ప్రేమ పుకార్లు ..!




**వేద న్యూస్, డెస్క్:**

కోలీవుడ్ టాప్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచంద్రన్, సన్‌రైజర్స్ హైదరాబాద్ యజమాని కావ్య మారన్ ప్రేమలో ఉన్నారని సోషల్ మీడియాలో పుకార్లు మళ్లీ తెరపైకి వచ్చాయి. ఇప్పటికే ఈ జంట రిలేషన్‌పై పలు వార్తలు వెలువడ్డా, తాజాగా ఓ వైరల్ వీడియోతో ఈ గాసిప్స్‌కి మళ్లీ బలం చేకూరింది. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వీడియోలో అనిరుధ్, కావ్య మారన్ ఇద్దరూ న్యూయార్క్ వీధుల్లో కలిసి షికార్లు చేస్తూ కనిపించారు. ఓ అమెరికన్ యూట్యూబర్ తీసిన వీడియోలో అనుకోకుండా వీరిద్దరూ కనిపించడంతో, అభిమా నులు ఆశ్చర్యపోయారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో నెటిజన్లు "సీక్రెట్ లవర్స్ దొరికేశారు!" అంటూ కామెంట్లు చేస్తున్నారు.ఇకపోతే, కోలీవుడ్ సర్కిల్‌లో వీరి పెళ్లి వచ్చే ఏడాదిలోనే జరిగే అవకాశం ఉందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఇరువురు కుటుంబాలకీ ఈ రిలేషన్ గురించి తెలిసినట్టు, పెద్దల అంగీకారంతోనే పెళ్లి జరగబోతుందనే టాక్ వినిపిస్తోంది. అయితే, ఈ వార్తలపై అనిరుధ్ టీమ్ ఇప్పటికే క్లారిటీ ఇచ్చారు. "వీరిద్దరూ మంచి స్నేహితులు మాత్రమే" అని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం తమిళంలో దళపతి విజయ్ 'జననాయకన్', లోకేష్ కనగరాజ్ 'డీసీ', తెలుగులో నాని 'ది ప్యారడైజ్', ఎన్టీఆర్ 'దేవర 2' చిత్రాలకు సంగీతం అందిస్తు న్నారు.మరోవైపు కావ్య మారన్ ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ సహ యజమానురాలు, చైర్మన్‌గా ఉన్నారు. ఆమెకు సోషల్ మీడియాలో భారీ ఫాలోయింగ్ ఉండగా, ఐపీఎల్ మ్యాచ్‌ల్లో ఆమె కనిపించే ప్రతి సారి ఫ్యాన్స్ ప్రత్యేకంగా ట్రెండ్ చేస్తుంటారు. కాగా, వైరల్ వీడియోతో మళ్లీ హాట్ టాపిక్‌గా మారిన అనిరుధ్-కావ్య మారన్ జంట, పెళ్లి వార్తలపై ఏమైన స్పందిస్తారా అన్నది చూడాలి.

# 'చిరు' ఫైట్ సీక్వెన్స్


**వేద న్యూస్, డెస్క్:**




టాలీవుడ్ స్టార్ యాక్టర్ చిరంజీవి టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం మన శంకర వర ప్రసాద్‌గారు'పండగకు వస్తున్నారు' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తోన్న ఈ మూవీని అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తున్నాడు. ప్రస్తుతం అనిల్ రావిపూడి టీం చిరంజీవిపై వచ్చే ఫైట్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నట్టు సమాచారం. మరో రెండు రోజుల పాటు షూటింగ్ కొనసాగనుందట. ఈ మూవీలో వీటీవీ గణేశ్, కేథరిన్ థ్రెసా, హర్షవర్దన్, రేవంత్ భీమల (సంక్రాంతికి వస్తున్నాం) ఫేం బుల్లిరాజు) కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల-విష్ణు ప్రసాద్ హోం బ్యానర్ గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ మూవీని 2026 సంక్రాంతి కానుకగా విడుదల చేయనుండగా.. రిలీజ్ డేట్‌పై మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.

# నన్ను చంపాలనుకున్నారు! – అదా శర్మ సంచలనం..

**వేద న్యూస్, డెస్క్:**



ప్రముఖ నటి అదా శర్మ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. 2008లో దర్శకుడు విక్రమ్ భట్ తెరకెక్కించిన హారర్ మూవీ '1920' తో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన అదా, తన నటనతో మొదటి సినిమాతోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత టాలీవుడ్‌లో పూరి జగన్నాథ్ – నితిన్ కాంబినేషన్‌లో వచ్చిన 'హార్ట్ ఎటాక్' మూవీతో గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది. ఆ చిత్రంలోని ఆమె ప్రదర్శనకు మంచి ప్రశంసలు లభించాయి. తర్వాత 'సన్నాఫ్ సత్యమూర్తి', 'క్షణం', 'కల్కి' వంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకుల మనసుల్లో చోటు సంపాదించింది.అయితే ఆశించిన అదే ధైర్యం ఆమె కెరీర్‌ను పూర్తిగా మార్చేసింది. 2023లో విడుదలైన 'ది కేరళ స్టోరీ' అదా శర్మ జీవితానికి నిజమైన టర్నింగ్ పాయింట్ అయింది. ఈ లేడీ ఓరియెంటెడ్ సినిమా దేశవ్యాప్తంగా భారీ చర్చకు దారితీసింది. రాజకీయ వివాదాల మధ్య విడుదలైన ఈ చిత్రం రూ. 400 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఈ మూవీతో అదా ఒక్కసారిగా నేషనల్ లెవెల్‌లో పాపులర్ అయింది.ఇటీవల ఒక ఇంటర్వ్యూలో అదా మాట్లాడుతూ.."ది కేరళ స్టోరీ విడుదలైనప్పుడు సగం దేశం నన్ను చంపాలని అనుకుంది. కానీ మిగతా సగం దేశం నన్ను ప్రేమించి రక్షించింది. 1920 నుంచే నేను రిస్క్ ఉన్న రోల్స్ ఎంచుకుంటున్నాను. ఆ రిస్క్ వల్లే నేడు నాకు గుర్తింపు వచ్చింది.